# ఇష్టం-ప్రేమ

**-అపర్ణా దీక్షిత్**

నాన్నగారికి కైకలూరుకు ట్రాన్స్‌ఫర్ అయి రెండునెలలైంది. ఒకసారి వచ్చి వెళ్లమని అమ్మ వారానికి రెండుసార్లు ఫోన్ చేస్తోంది. శని, ఆదివారాలు చూసుకుని కైకలూరు వెళ్లాను. నన్ను చూసి అమ్మా నాన్న చాలా సంతోషించారు.

"ఈ ఊరు మీకు బాగా నచ్చిందా? ఊరిలో విశేషాలేమిటి? అడిగాను.

"ఈ ఊరి దేవత శ్యామలాంబాదేవి. ఊరిలో సగంమంది ప్రతి రోజూ గుడికి వెళితే శుక్రవారం మాత్రం అందరూ శ్యామలాంబాదేవిని దర్శిస్తారు. సాయంత్రం నువ్వూ నేనూ గుడికి వెళదాం" అంది అమ్మ.

అమ్మ గుడిలోకి వెళ్లింది. నేను చెప్పలు విడుస్తూ ఆ అమ్మాయిని చూసాను. చందనపు బొమ్మలా ఉంది. ఏ కుర్రాడైనా ఒక్కసారి చూస్తే చాలు ప్రేమలో పడిపోతాడు. ఈ అమ్మాయికోసం ఈ ఊళ్లో ఎంతమంది పోటీ పడుతూ ఉంటారో? అనుకుని నా ఆలోచనలకు నేనే నవ్వుకున్నాను.

అమ్మవారి దర్శనం అయిన తరువాత బయటకు వచ్చి కూర్చున్నాం. ఆ అమ్మాయిని అమ్మకి చూపించి "నాకు బాగా నచ్చిందమ్మా' అన్నాను.

"అవును. చాలా అందమైన పిల్ల. మనవాళ్లే, వాళ్ల నాన్నగారు కూడా మీ నాన్నగారు పని చేసే స్కూల్లోనే టీచర్‌గా పని చేసేవారట. రెండేళ్ల క్రితం ఏదో యాక్సిడెంట్‌లో చనిపోయారని చెప్పింది."

"నేను ఆ అమ్మాయినే పెళ్లి చేసుకుంటానమ్మా. ఈ ఊళ్లో పుట్టిన మొదటి పిల్లకి శ్యామల అని పేరు పెడతారన్నావుగా? ఆ అమ్మాయి పేరు కూడా అదేనా?'' నవ్వుతూ అడిగాను.

"లేదురా. ఆ పిల్ల భద్రాచలంలో పుట్టిందిట తాతగారి ఇంట్లో. అందుకే సీత అని పేరు పెట్టారుట'' అమ్మ కూడా నవ్వుతూ చెప్పింది.

"అయితే మా పేర్లు కూడా కలిసాయమ్మ సీతారాములు..'' అన్నాను ఆనందంగా.

మరునాడే వాళ్లకు కబురు చేయడం, వెంటనే నిశ్చితార్థం జరగడం అంతా చకచకా జరిగిపోయాయి.

"అమ్మా! నేను వెళ్లొస్తానమ్మా. శుభలేఖలకి మంచి డిజైన్ చూసి నేనే ప్రింట్ చేయిస్తాను'' అన్నాను.

అమ్మ కూడా ఆనందంగా సరేనంది.

***

వారం తరువాత శుభలేఖలు చేతికి వచ్చాయి.

అమ్మావాళ్లకి ఇచ్చి వద్దాం అని అనుకుంటూ ఉండగా అమ్మ దగ్గర నుంచి ఫోన్ వచ్చింది 'వెంటనే బయలుదేరి రమ్మని' అమ్మ గొంతులో ఆందోళన నన్ను కలవరపరచింది. బస్టాండ్‌కెళ్లి దొరికిన బస్ ఎక్కి రెండుగంటల్లో కైకలూరు చేరుకున్నాను.

అమ్మ నాన్నా ఎందుకు చాలా దిగులుగా ఉన్నారు. ఎదురుగా సుందరం మామయ్య. ఆయన ఈ ఊరివాడే. నేనొచ్చినప్పుడు ఆయన ఊళ్లోలేరు.

"ఏమిటి విషయం? ఎందుకు వెంటనే రమ్మని హడావుడిగా ఫోన్ చేసారు?'' వాళ్లను అనుమానంగా చూస్తూ అడిగాను.

"మామయ్య చెప్పాడురా... ఆ పిల్ల తండ్రి నలభై వయసులో చనిపోయాడట. తాతగారు కూడా నలభైయ్యేళ్ల వయస్సులోనే చనిపోయారుట. ఆ ఇంట్లో ఉన్నది నాన్నమ్మ, అమ్మ, ఆ అమ్మాయి. ఆ ఇంట్లో వాళ్లు నలభై వయస్సుకే చనిపోతారని ఒక పుకారు. ఇది మూఢనమ్మకమే కావచ్చు. అందుకే ఈ ఊళ్లో ఎవరూ ఆ పిల్లను వివాహం చేసుకోవడానికి ముందుకు రావడంలేదని మీ మామయ్య అంటున్నాడు. ఇక నీ ఇష్టం. నువ్వు ఏ నిర్ణయం తీసుకున్నా మాకు ఎలాంటి అభ్యంతరంలేదు'' అమ్మ నిర్ణయాన్ని నాకే వదిలేసి లోపలకు వెళ్లిపోయింది.

నేను గదిలోకి వెళ్లి మంచంమీద వాలిపోయి మౌనంగా నాలో నేను రోదించాను. తీసుకొచ్చిన శుభలేఖలన్నీ చింపేసాను.

ఇంతలో ఆ అమ్మాయి మేనమామ శంకరం వచ్చాడు. నాన్నగారు ఆయనతో నా నిర్ణయం చెప్పారు.

ఈ మాట వినగానే ఆయన అగ్గిమీద గుగ్గిలమయ్యాడు. నానా మాటలు అన్నాడు. నిశ్చితార్థం జరిగి శుభలేఖలు కూడా వేయించాక ఇప్పుడు ఆ పిల్లను చేసుకోను అంటే ఇంక ఆ పిల్లను ఎవరు చేసుకుంటారని అడిగాడు.

ఆయన అడిగే ప్రశ్నలన్నిటికీ మౌనమే సమాధానమయింది.

నా దగ్గరున్న పాతికవేల రూపాయలు ఆయన చేతిలో వుంచి "నన్ను క్షమించండి. ఇది నా అపరాధానికి...'' ఇంక మాట్లాడలేక బయటకు వచ్చేసాను.

నెలరోజుల తరువాత ఆ అమ్మాయిని శంకరం మామయ్య కొడుకే పెళ్లి చేసుకున్నాడని తెలిసి చాలా ఆనందపడ్డాను.

***

సీతను మరచిపోవడానికి నాకు చాలాకాలం




పట్టింది.

ఒకరోజు ఇంట్లో ఏం తోచక సినిమాకు వెళ్లినప్పుడు సీత కనబడింది.

అప్పటికన్నా ఇప్పుడు చాలా అందంగా ఉంది. ఆమె కూడా నన్ను చూసి పక్కనున్న అతనితో ఏదో చెప్పింది. ఇద్దరూ కలసి నావైపు వస్తుంటే కంగారుపడ్డాను. అతను చనువుగా నా చేయి అందుకున్నాడు.

"మీ దయవల్లే నాకు సీత దక్కింది. చిన్నప్పటి నుంచీ నాకు సీత అంటే చాలా ఇష్టం. కానీ తను దురదృష్ట వంతురాలని నాన్న నన్ను సీతకి దూరంగా ఉంచారు. నిశ్చితార్థం జరిగిన తరువాత మీ పెళ్లి ఆగిపోవడంతో సీత మీద మరో మచ్చ పడింది. దాంతో నాకు అందరి మీద మీదా ముఖ్యంగా మా నాన్నగారిమీద చాలా కోపం వచ్చింది. ఆయన్ని ఎదిరించి సీతను నాదాన్ని చేసుకున్నాను. మీరిచ్చిన పాతికవేల రూపాయలు నా దగ్గరే ఉన్నాయి. రేపు మీరు మా ఇంటికి వచ్చి ఆ డబ్బు తీసుకుంటే నాకు తృప్తిగా ఉంటుంది. తప్పకుండా రండి రామారావుగారూ" అని తన అడ్రస్ ఇచ్చాడు.

సీతకి నాకంటే మంచి భర్త దొరికాడు. మూఢ నమ్మకంతో సీతను పోగొట్టుకున్నాను. సీతను నాకంటే అతనే ఎక్కువగా ప్రేమించాడనడంలో ఎలాంటి సందేహంలేదు.

సీతను నేను ఇష్టపడ్డాను. ప్రాణాపాయం అనేసరికి తప్పుకున్నాను. ఇష్టాన్ని చంపుకోవచ్చు.

కానీ ప్రేమను ఎవరూ చంపుకోలేరు. దీనిని బట్టి నేను సీతను కేవలం ఇష్టపడ్డాను కానీ ప్రేమించలేదు అని అర్థమయింది.

★